క్లుప్తంగా

అభ్యసనా సామర్థ్యాలు బాగుండాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ ఎరకయ్య

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు బాగుండాలని ఎంఈఓ-2 బి.ఎరకయ్య అన్నారు. మండలంలో ఆమదాలవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల టీఎల్ఎం పరిశీలించడంతో పాటు ఒంటిపూట బడుల పని సమయం, తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.వరుణకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రానివ్వం


పాగిరిలో తాగునీటి బోరును బాగు చేయిస్తున్న ఎంపీడీఓ

రాజాం: వేసవిలో తాగునీటి ఎద్దడి ఏ గ్రామంలో కూడా కనిపించకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు వెల్లడించారు. మండలంలో పాగిరి గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను మెకానిక్‌లతో గురువారం బాగు చేయించారు. క్రాష్ ప్రోగ్రాం ద్వారా రూ. 5 లక్షల నిధులు మండల పరిషత్ కేటాయించిందని, ఈ నిధులతో మండలంలో ఇప్పటి వరకూ 48 బోర్లను బాగు చేశామని తెలిపారు.

ప్రజలు కలసిమెలసి ఉండాలి


వావిలవలసలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రేగిడి: గ్రామాల్లో నివసిస్తున్న వారంతా కలసిమెలసి ఉండాలని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వావిలవలస గ్రామంలో ఎన్నికల నేపథ్యంలో గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, గొడవలు రాకుండా చూసుకోవాలని కోరారు. ప్రతీ ఒక్కరి సహకారం అవసరమని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ మొయిద శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసు కవాతు


కొండవలసలో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ మహేంద్ర, సీఐ శ్రీనివాస్ తదితరులు

రేగిడి: మండలంలోని కొండవలస గ్రామంలో చీపురుపల్లి ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర, రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు కవాతు గురువారం నిర్వహించారు. కంపెనీ పోలీసులతో కలసి గ్రామంలో ప్రతీ వీధిలో కవాతు నిర్వహించారు. మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించే దిశలో భాగంగా ఫ్లాగ్ మార్చ్ చేస్తున్నామని డీఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ద్వారా తాగునీటిని అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బాడంగి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పనుల కోసం వచ్చిన ప్రజల వేసవి దాహార్తిని తీర్చేందుకు తహసీల్దార్ ఎస్.రాజారావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కార్యాలయానికి దూర గ్రామాల నుంచి వచ్చిన వినియోగదారులు, అర్జీదారులతో పాటు రోడ్డుమీదుగా కాలిబాటన వెళ్లే పాదచారులకు దాహార్తిని తీర్చే విధంగా ఈ చలివేంద్రాన్ని కార్యాలయం బయట ఏర్పాటు చేశారు. సీనియర్ అసిస్టెంట్ ఎర్రయ్య, ఓఎస్‌లు సూర్యారావు, గౌరీఈశ్వరి, సంతోష్, వీఆర్ఏ అప్పలస్వామి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రాజాం సిటీ: మండల పరిధి కంచరాం గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ ఎస్‌కే రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఆయా ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను బాటసారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే ఆయా గ్రామాల యువకులు చలివేంద్రాలు ఏర్పాటుకు ముందుకు రావాలని అన్నారు. ఈయనతో పాటు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికలే లక్ష్యం

- 1940 మందిపై బైండోవర్ కేసులు
- పది సమస్యాత్మక గ్రామాలపై దృష్టి
- ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర


ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర

రాజాం: త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు పోలీస్ యంత్రాంగం తీసుకుంటుందని చీపురుపల్లి ట్రైనీ డీఎస్పీ సాకే మహేంద్ర అన్నారు. గురువారం రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సాక్షితో ఎన్నికల నిర్వహణలో పోలీస్ పాత్రపై మాట్లాడారు. ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్ లక్ష్యంగా గ్రామాల్లో చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలో రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించామని వివరించారు. గత నెల రోజులుగా ఈ పంచాయతీల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడినా, అతిగా వ్యవహరించినా కేసులు నమోదవుతాయని వివరించారు. నియోజకవర్గంలో గతంలో సమస్యాత్మకంగా వ్యవహరించినట్లు అనుమానాలు ఉన్న 1968 మందిని గుర్తించామని, వీరిలో 1940 మందిపై బైండోవర్ కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. మరో 28 మందిపై కేసులు నమోదుచేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో సమస్యాత్మక గ్రామాలు గుర్తింపు పూర్తయిందని, ఆయా గ్రామాలపై నిఘా పెట్టామని, పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గ రూరల్ పరిధిలో ఇప్పటివరకూ అక్రమంగా తరలిస్తున్న 586 మద్యం బాటిళ్లను పట్టుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు పెట్టామని పేర్కొన్నారు. వంగర మండలంలో 13 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేశామని, 2600 లీటర్లసారా తయారీ ముడిసరుకును ధ్వంసం చేశామని వివరించారు. ప్రలోభాలకు గురిచేసే వ్యక్తులపై నిఘా ఉందని, డబ్బు, మద్యం అక్రమ విక్రయాలు, తరలింపులు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు ఫ్రీగా, ఫెయిర్‌గా ఓటు వేసే దిశగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. రాజాం-శ్రీకాకుళం రోడ్డులో పాగిరి జంక్షన్ వద్ద అంతరజిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని తెలిపారు.

90 శాతం పింఛన్ల పంపిణీ


రాజాం సిటీ: పాగిరిలో పింఛన్ పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు


బాడంగి: సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది


సంతకవిటి: కృష్ణంవలసలో పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

రాజాం సిటీ: రాజాం మండలంలోని అన్ని పంచాయతీలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తయ్యాయని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండల పరిధి పాగిరి, బొడ్డవలస, అంతకాపల్లి గ్రామాల్లోని పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించారు. సచివాలయానికి రాలేని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్ అందించారు.

బాడంగిలో...

బాడంగి: మండలంలోని 18 గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలు పంపిణీ కేంద్రాలుగా తొలి రోజు గురువారం నాటికే 90శాతం మేరకు పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీఓ ఆంజనేయులు చెప్పారు. మొత్తంగా ఏప్రిల్ నెలకుగాను 8వేల645 పింఛన్లు కేటాయింపు కాగా వీటిలో 7వేల780 పింఛన్ల వరకు పంపిణీ పూర్తయిందన్నారు. మిగిలిన పింఛన్లు ఆరవ తేదీలోగా పంపిణీ పూర్తి చేస్తారన్నారు.


రేగిడి : వన్నలిలో పింఛన్ల కోసం క్యూలో లబ్ధిదారులు

86 శాతం పింఛన్ల పంపిణీ

సంతకవిటి: మండల పరిధిలోని 24 సచివాలయాల పరిధిలో గురువారం సాయంత్రానికి 86శాతం పింఛ న్లు పంపిణీ జరిగినట్లు ఎంపీడీఓ పైడితల్లి తెలిపారు.

81 శాతం ఫించన్లు పంపిణీ

రేగిడి: మండలంలో గురువారం 81 శాతం మేర పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందని ఎంపీడీఓ శ్యామలాకుమారి తెలిపారు. మండలంలో మొత్తం 11,034 ఫించన్లు కాగా, 8937 ఫించన్లు పంపిణీ పూర్తి చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో గ్రామ సచివాలయాల వద్ద, పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు వద్ద ఈ పింఛన్లు పంపిణీ చేశామని, దివ్యాంగులకు, రోగులకు శుక్రవారం ఇంటికి వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందజేస్తారని తెలిపారు.

గిరిజన గ్రామాల్లో పింఛన్లు పంపిణీ

మెంటాడ: మండలంలోని కొండపర్తి గ్రామంలో లోతుగెడ్డ సచివాలయం సిబ్బంది గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ అందుకునేందుకు ఒక ప్రాంతాన్ని ఎన్నుకొని అక్కడికే అందరూ వచ్చి పింఛను తీసుకున్నారు. సుమారు 38 మంది లబ్ధిదారులకు ఈ పింఛను అందజేశారు. ముఖ్యంగా 2కిలోమీటర్ల దూరంలో గల వారందరూ ఇక్కడికే వచ్చి పింఛను తీసుకున్నారు. మండలంలోని కొండలింగాలవలస, ఉద్దంగి, కూనేరు, ఆంద్ర, పిట్టాడ, గుర్ల, గుర్లతమ్మిరాజుపేట, ఆగూరు గ్రామాల్లో కూడా పింఛన్లను సచివాలయం సిబ్బంది అందజేశారు.

మళ్లీ వచ్చేది జగనన్న సంక్షేమ ప్రభుత్వమే


సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

సంతకవిటి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని, మళ్లీ జగనన్న సంక్షేమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని శ్రీహరినాయుడుపేట, కృష్ణంవలస, గోళ్లవలస, కే.ఆర్.పురం, యం.ఆర్.అగ్రహారం, ఎస్.అగ్రహారం, జావాం, కొండగూడేం, మాధవరాయపురం గ్రామాలలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి 58 నెలల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. పలువురు వృద్ధులు, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సంక్షేమ ప్రభుత్వం మళ్లీ రావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది

ఇంటింటి ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం కృష్ణంవలస గ్రామంలో పర్యటిస్తున్న రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, పింఛన్ కోసం లైన్లో నిల్చున్న లబ్ధిదారుల దగ్గరకు వెళ్లి పింఛన్ కోసం ఆరా తీయగా, లబ్ధిదారులు బాధతో మాట్లాడుతూ చంద్రబాబుకు మా ఉసురు తగులుతుందని విలపించారు. నియోజకవర్గ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు గంగ్రేటి కేసరి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, వైస్ ఎంపీపీ పందు పాపారావు, గోళ్లవలస సర్పంచ్ దాసరి దాలినాయుడు, ఎంపీటీసీ టంకాల కాశి, కె.ఆర్.పురం సర్పంచ్ పందు రాజగోపాలరావు, కృష్ణంవలస సర్పంచ్ గంగ్రేటి సురేష్, కొండగూడేం సర్పంచ్ కె.వి.నాయుడు, ఎంపీటీసీ కె.అప్పారావు, సర్పంచ్‌లు వి.రమణ, మొయ్యి మోహన్, పప్పల ఈశ్వరరావు, నునగొప్పల ఈశ్వరరావు, ఎంపీటీసీలు కనకల సన్యాసినాయుడు, యినమల మురళికృష్ణ, వి.శ్రీనివాసనాయుడు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన


కూనాయవలసలో వృద్ధురాలికి పెన్షన్ డబ్బులు అందజేస్తున్న ఎంపీడీవో

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో రెండు రోజులుగా జరుగుతున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో బి.మధుసూదనరావు అన్నారు. మండలంలోని కూనాయవలస సచివాలయంలో జరుగుతున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున సచివాలయాల వద్ద పెన్షన్ల పంపిణీ చేస్తున్న సమయంలో టెంట్లు వేయాలని, తాగునీరు సౌకర్యం కల్పించాలని తెలిపారు. పెన్షనర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పంచాయతీ కార్యదర్శులంతా చూడాలన్నారు. పెన్షనర్లు ఏ గుర్తింపు కార్డు తీసుకొని వచ్చినా పెన్షన్ డబ్బులు అందజేయాలని సూచించారు. పెన్షన్ల పంపిణీ శతశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు.

వార్డుల్లో వైఎస్సార్ సీపీ ప్రచారం


ఆదర్శనగర్‌లో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజాం: పట్టణంలోని ఆదర్శనగర్, మల్లయ్యపేట, అమ్మవారికాలనీ తదితర వార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రచారం గురువారం నిర్వహించారు. పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్యలు ప్రచారం నిర్వహించారు. పార్టీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌ని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, పార్టీ నాయకులు దూబ గోపాలం, ఆర్నేపల్లి వెంకటనాయుడు, జేసీబీ శ్రీను, వెంపల లక్ష్మణరావు, యందవ చినబాబు, సత్యనారాయణ, గోకవలస బాబూరావు, వై.జయరాం మాస్టరు, కొల్లా రమ్య, యందవ సుశీల, కెల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం

బాడంగి: మండలంలోని కోడూరు, బాడంగి గ్రామాలలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, బెల్లాన చంద్రశేఖర్ ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు తెలిపారు. ఉదయం కోడూరు, మధ్యాహ్నం బాడంగిలో ప్రచారం చేయనున్నట్టు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: మండలంలోని చిన్నపుర్లి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహించిన చిన్మయి సమేత చిదంబరీశ్వస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు ఈ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ కురిటి రామకోటి, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : డీఎస్పీ

బొబ్బిలి: రోడ్లపై వాహనాలు నడిపేవారు భద్రతా నియమాలు పాటించాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని పాత బొబ్బిలి జంక్షన్ వద్ద వాహనదారులను నిలిపి వారికి పలు సూచనలు చేశారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లైసెన్సులు, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. వాహనదారులు తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలు చేయాలన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ వి.బలరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనదారులు తస్మాత్...

రాజాం: ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ఉపాధి పనులు చేయవద్దని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ మీసాల శ్రీనివాసరావు వేతనదారులకు సూచించారు. మండలంలోని మొగిలివలస గ్రామంలో పెంటవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులు గురువారం పరిశీలించారు.

ప్రజలు వివాదాలకు పాల్పడొద్దు

వంగర: గ్రామాల్లో ప్రజలు వివాదాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వై.వి.జనార్ధన్ కోరారు. మండల పరిధి కోనంగిపాడు గ్రామంలో ప్రజలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల వేళ ప్రజలు సోదర భావంతో మెలగాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సిద్ధం

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ బొబ్బిలి అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గెలుపునకు తామంతా సిద్ధంగా ఉన్నామని 41, 56 బూత్‌ల ప్రజలు నాయకులు అన్నారు. జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు(విసు)ఆధ్వర్యంలో గురువారం బూత్ లెవెల్‌లో సమావేశాలు, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసిన కౌన్సిలర్ చోడిగంజి అనసూయ ప్రజలకు వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాలను వివరించారు.

చంద్రబాబు కుట్రలతో వృద్ధులకు అవస్థలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: చంద్రబాబు కుట్రలతోనే వృద్ధులు, దివ్యాంగులు తదితర పింఛన్‌దారులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై విషం కక్కుతూ వారిపట్ల చంద్రబాబు సైంధవుడుగా మారాడన్నారు. చంద్రబాబు స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న కుట్ర రాజకీయాల వల్ల వలంటీర్లను విధుల నుంచి తప్పించడంతో నాలుగున్నరేళ్లకు పైగా సజావుగా సాగిన ఇంటింటికీ పింఛన్ల పంపిణీ ఆగిపోయిందని, దీని వల్ల లక్షల మంది అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతు అక్కాచెల్లెమ్మలు మండుటెండల్లో రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. పేదలంటే చంద్రబాబుకు ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టమవుతోందని, ఏం చేసినా, ఎన్ని కుట్రలు పన్నినా వలంటీర్ వ్యవస్థను ఏమి చేయలేరన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం

గత ఎన్నికల్లో అఖండ విజయం సాధించి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఈ ఎన్నికల్లో కూడా మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.మానవత్వం లేని చంద్రబాబు ప్రజలలో విశ్వసనీయత కోల్పోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయాన్ని నమోదు చేయడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, మండల పార్టీ అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు, కటికి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి


కూరాకుల వీధిలో గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న సీఐ

రామభద్రపురం: మే నెలలో జరగనున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని సీఐ తిరుమలరావు అన్నారు. మండలంలో గుర్తించిన సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలలోని గురువారం ఆయన పెద్దలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అక్కడ శాంతియుత ఎన్నికలే లక్ష్యంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో గ్రూపు తగాదాలు పెట్టుకోకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లు ఎటువంటి ఒత్తిడిలకు భయపడకుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ జ్ఞానప్రసాద్, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు


రామభద్రపురం సచివాలయం-2లో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

రామభద్రపురం: పింఛన్ అందుకోవడం కోసం వస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇబ్బందులు పడకుండా సచివాలయాలు వద్ద వసతులు కల్పించాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆదేశించారు. మండలంలోని గురువారం ఆమె పలు సచివాలయాలను సందర్శించి అక్కడ పింఛన్ల పంపిణీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పింఛన్లు పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. సచివాలయాలు వద్ద నీడకు టెంట్లు, కుర్చీలు, తాగునీరు, సదుపాయాలు కల్పించాలన్నారు. నడవలేక ఇబ్బందులు పడుతున్న వారిని ద్విచక్ర వాహనాలపై ఇళ్లకు పంపిచాలన్నారు. మంచం పట్టిన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇంటికి వెళ్లి పింఛను అందజేయాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 90 శాతం పింఛన్లు పంపిణీ జరిగిందని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


అరసాడ పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఈఆర్‌వో జోసెఫ్

వంగర: మండలంలోని అరసాడ, మద్దువలస, వంగర గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను రాజాం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్(ఈఆర్‌వో) ఎల్.జోసెఫ్ బుధవారం పరిశీలించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు పరిశీలించారు. రెండు ద్వారబంధాలున్న గదులకు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలని, కేంద్రాల వద్ద టెంట్లు వేయాల్సి ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఎన్నికల అంశాలపై సమీక్షించారు. తహసీల్దార్ చిరంజీవి పడాల్, ఫ్లైయింగ్‌స్క్వాడ్ చంద్రరావు, డీటీ బూరాడ సుందరరావు, ఆర్ఐ జామి మురళి, జూనియర్ అసిస్టెంట్ యు.ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ద్విగ్విజయంగా పింఛన్ల పంపిణీ

- మున్సిపాలిటీలో 92.18 శాతం, మండలంలో 85.73 శాతం పంపిణీ పూర్తి


గొల్లపల్లి జంక్షన్ వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బొబ్బిలి: చంద్రబాబు అండ్‌కో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్నప్పటికీ వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, దీర్ఘకాలిక, చేనేత పింఛనుదారులకు పింఛన్ల పంపిణీని అధికాలులు దాదాపు పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం ప్రారంభమయిన పంపిణీ కార్యక్రమం గురువారం సాయంత్రం దాదాపు పూర్తయినట్టు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, ఎంపీడీఓ పి.రవికుమార్‌లు తెలిపారు. మండలంలో 11148 పింఛన్లున్నాయి. మున్సిపాలిటీలో 5,756 పింఛన్లున్నాయి. రెండు రోజుల పాటు పంపిణీ జరిగిన తరువాత మున్సిపాలిటీలో 92.18శాతం పంపిణీ పూర్తయిందని కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు. మండలంలో 85.73 శాతం పంపిణీ పూర్తయింది. పింఛన్ల పంపిణీ కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్లు వేసి త్వరితగతిన పింఛన్లు పంపిణీ చేశారు. మంచంపై లేవలేని వారికి ఇంటికెళ్లి పింఛన్లు అందజేశారు.

స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలి

వంగర: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ట్రైనీ డీఎస్పీ మహేంద్ర అన్నారు. బుధవారం మండల పరిధి అరసాడలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లో అసాంఘిక శక్తులు అల్లర్లకు పాల్పడకుండా నిరోధించడమే ఈ ఫ్లాగ్‌మార్చ్ ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వై.వి.జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.